క్లుప్తంగా

శ్రీవారి సేవలో డీసీజీఐ ఈశ్వరరెడ్డి


డీసీజీఐ ఈశ్వరరెడ్డికి శ్రీవారి మొమెంటోను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని డ్రగ్ కంట్రోలర్, జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) డాక్టర్ ఎస్ ఈశ్వరరెడ్డి ఆదివారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు చినవెంకన్న మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సన్నిధిలో..


శ్రీవారిని దర్శించుకున్న నటుడు గౌతంరాజు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని సినీ హాస్య నటుడు గౌతం రాజు ఆదివారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో ఫొటోలు దిగేందుకు పలువురు భక్తులు ఆసక్తి చూపారు.

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం: బీజేపీ పాలనకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటీ చేపట్టిన ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకురాలు కొర్రి విజయలక్ష్మి కోరారు. స్థానిక భగత్ సింగ్ కాలనీలో కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై సీపీఎం నాలుగు బస్ యాత్రలను చేపట్టిందని అన్నారు. సోమవారం జీలుగుమిల్లి మండలానికి బస్ యాత్ర చేరుకుంటుందని చెప్పారు.

అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

కుకునూరు: అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని సీపీఐఎంఎల్ ప్రజాపందా జంగారెడ్డిగూడెం డివిజన్ నాయకులు కొండ ప్రసాద్ పిలుపునిచ్చారు. కుక్కునూరులో సీపీఐ ఎంఎల్ ప్రజాపందా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం స్మారక సభ నిర్వహించారు. అమరవీరులను స్మరిస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఈ సభలో డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్‌తో కలిసి ప్రసాద్ మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ మార్పు కోసం ప్రతి ఉద్యమాలలో పోరాటాలలో ప్రగతిశీల శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.

లైఫ్ సర్టిఫికెట్లు జనవరి నుంచి అందజేయాలి

కొయ్యలగూడెం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు 2024 సంవత్సరం జనవరి లేదా ఫిబ్రవరి నెలలలో లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కరోతు నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్లు నవంబర్ లేదా డిసెంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలా అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. దీనిపై జంగారెడ్డిగూడెం సబ్ ట్రెజరీ అధికారి వివరణ ఇస్తూ వచ్చే ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి లోపు లైఫ్ సర్టిఫికెట్లు మీసేవ కేంద్రాలలో, లేదా ట్రెజరీ కార్యాలయంలో అందచేస్తే సరిపోతుందని చెప్పారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్తలకు సత్కారం


కార్యకర్తలను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్తలు మద్దిపాటి శ్రీను, అల్లం సూరిబాబులను సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. తాపీ మేస్త్రీలుగా జీవనం సాగిస్తూ.. సాయంత్రం నుంచి నవరత్న పథకాలపై ప్రచారం నిర్వహిస్తూ వైఎస్సార్ సీపీపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తుండడం అభినందనీయమని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు అన్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు మద్దిపాటి శ్రీను, అల్లం సూరిబాబులకు సర్పంచ్‌ల చాంబర్ నియోజకవర్గ అధ్యక్షుడు గేలం త్రివిక్రమ సోమరాజు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను ప్రధానం చేశారు. సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్

చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా


ధర్మాజీగూడెంలో మాట్లాడుతున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా


సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ సాధ్యమని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ధర్మాజీగూడెంలోని ప్రసాద్ ఏసీ కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రాకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో సువర్ణ పాలన సాగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో మంచి జరిగిందని అనుకుంటేనే మళ్లీ తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ధైర్యంగా చెప్పిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ సేవలను గ్రామాల్లో సైతం ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత జగనన్నదే అన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లిస్తేకానీ పథకాలు అందేవి కావని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ప్రజలు ఇబ్బందులు పడిన వైనం, జగనన్న పాలనలో ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్న వైనాని బేరీజు వేసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారన్నారు. జగన్ హయాంలో ఏపీ అభివృద్ధి చెందుతోందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కర్లపూడి జాన్సి, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు,పి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు రావి కొండయ్య, మందలపు నరసింహరావు, కొత్తూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ


కుక్కునూరులో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

కుక్కునూరు: పింఛన్ కోసం పడిగాపులు పడకుండా వృద్ధుల ఇంటికే వెళ్లి పింఛన్ అందించడం కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమైంది. ప్రతినెలా 1వ తేదీనే లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారు. ఎవరైనా అందుబాటులో లేకపోతే వివరాలు తెలుసుకుని వారికి మిగిలిన రోజుల్లో అందిస్తున్నారు. ఎవరూ ఏ కార్యాలయానికి వెళ్లకుండా వారి ఇంటి వద్దే పింఛన్ అందిస్తుండంతో పింఛన్ లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర రాజకీయాలను తిరగరాసిన ప్రజాసంకల్ప యాత్ర

- నేటికి ఆరేళ్లు పూర్తిచేసుకున్న పాదయాత్ర
- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- ప్రతి మండలంలోనూ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు


ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక ప్రజాసంకల్ప పాదయాత్ర రాష్ట్ర రాజకీయాన్నే మార్చేసిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదల జీవితాలు మెరుగుపడేలా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టడానికి తోడ్పడిన ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి నేటికి ఆరేళ్లు పూర్తయ్యిందని చెప్పారు. నాడు ఇడుపుల పాయ నుంచి తొలి అడుగు వేస్తూ 341 రోజుల్లో 13 జిల్లాలో 2,516 గ్రామాల్లో 134 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టి ప్రజల హృదయాల్లోకి సుస్థిర స్థానం సాధించారని చెప్పారు. అలాగే 124 బహిరంగ సభలు 55 ప్రజా సంఘాలను కలుసుకుని ప్రసంగించడం జరిగిందన్నారు. 2019 మేలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తూ తిరుగులేని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారని అన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛను కానుక, వైఎస్సార్ చట్ట నేస్తం, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ రైతన్న నేస్తం, వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ వాహన మిత్ర, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు ఉన్నాయని అన్నారు. మహిళా సంఘాలకు సున్నావడ్డీ రుణాలు, అలాగే ఆస్పత్రులు, పాఠశాలల్లో నాడు–నేడు పథకంలో రూపు రేఖలను మార్చడం జరిగిందని అన్నారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విద్యాకానుకతోపాటు ఆరోగ్యశ్రీ వంటి పథకాలను సమర్థవంతంగా, విజయవంతంగా అమలుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సాగిందని అన్నారు. నాటి పాదయాత్ర, జగనన్న పాలనను మరొక్కసారి ప్రజలకు గుర్తు చేసే విధంగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడంతోపాటు పాదయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కటింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రతి విద్యార్థీ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి


వసతి గృహ విద్యార్థులకు సామాజిక చైతన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: లక్ష్యం లేని ప్రయాణం చుక్కాని లేని నావ లాంటిదని, కావున ప్రతి విద్యార్థీ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని కొయ్యలగూడెం ఏఎస్‌డబ్ల్యూవో జి.సంకురయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గాయత్రి ఒకేషనల్ కళాశాలలో కళాశాల వసతిగృహం విద్యార్థులకు ఆదివారం సామాజిక చైతన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు విద్యనభ్యసించడమంటే సమాజంలోని నేటి వరకు అభివృద్ధి చెందిన సామాజిక, సాంకేతిక, నైతిక అభివృద్ధిని నేర్చుకోవడమే అన్నారు. ప్రతి ఒక్కరూ విజయాల వైపు పయనిస్తూ, భవిష్యత్తుకు ఒక మార్గదర్శిగా నిలవాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రుల ఆశయాలను నెర్చుతూ సత్‌ప్రవర్తనతో ముందుకు సాగాలన్నారు. సీడీపీవో పి.బ్యూల మాట్లాడుతూ విద్యార్థులు మానసిక, శారీరక ఆరోగ్యం కలిగి ఉండాలని, దీనిని పెంపొందించుకోవడం కోసం పౌష్టికాహారం తీసుకోవడం, ఒత్తిడి లేని ఉత్తమ ఆలోచనలతో విద్యనభ్యసించడం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటాచార్యులు, కళాశాల డైరెక్టర్ ఆర్.ఉదిరాజు, మహిళా సమైక్య కార్యదర్శి ఎండీ నజ్మ, వసతిగృహం సంక్షేమ అధికారులు ఎం.రాజు, జీఎస్‌ఆర్ కుమార్, ఈ.శివయ్య, బి.కరుణకుమారి, రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం


ద్వారకాతిరుమలలోని ఓటరు నమోదు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఈఆర్‌ఓ వెంకట సుధాకర్

ద్వారకాతిరుమల: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు మండలంలోని 64 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రెండు రోజులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నమోదు కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున ఓటర్లు ఓటు నమోదు, తొలగింపు, సవరణ, ఆధార్‌తో అనుసంధానం వంటివి చేసుకున్నారు. అలాగే 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇదిలా ఉంటే గోపాలపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) ఎం.వెంకట సుధాకర్ ద్వారకాతిరుమలలోని ఓటరు నమోదు కేంద్రాన్ని ఆదివారం పరిశీలించి, సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ బి.దుర్గా మహాలక్ష్మి తదితరులున్నారు.

టి.నరసాపురం: మండలంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులలో 181 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ జేవీ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకావాలన్నారు. మండంలోని 46 పోలింగ్ బూత్‌లలో ఫారం -6కు సంబంధించి 162 దరఖాస్తులు, ఫారం–7కు సంబంధించి 5 దరఖాస్తులు, ఫారం–8కు సంబంధించి 14 దరఖాస్తులు అందాయన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

90 మందికి ఉచిత కంటి పరీక్షలు


నేత్ర వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో లయన్స్‌క్లబ్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు మేడిశెట్టి శంకర్రావు తన కుమార్తె ధనలక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నిడదవోలుకు చెందిన ఆర్‌ఆర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు 90 మంది రోగులను పరీక్షించారు. అందులో 10 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అలాగే మరో 15 మందికి తక్కువ ధరకు కళ్లజోళ్లను, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు గంజి కాశీ విశ్వనాధం, కార్యదర్శి ముల్లంగి లోకానందరెడ్డి, ఫులపా ఆనంద్‌కుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు చిలుకూరి సుబ్రహ్మణ్యం, కోశాధికారి నాదెండ్ల బుల్లి వెంకటరావు, గౌరవ డైరెక్టర్ పావులూరి మధుసూదనరావు, సభ్యులు బొప్పన శేఖర్, ఘంటా శేషగిరి, వడ్లమూడి సూర్య నారాయణ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా ఏలూరు నగరం


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరం ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఆదివారం నగరంలోని తూర్పువీధి, సత్యనారాయణ పేట, నవాబ్‌పేట, బావిశెట్టిటవారి పేట ప్రాంతాల్లో నిర్వహించిన గంగానమ్మవారి సంబరాలు, తూర్పు లాకుల వద్ద సాయి నగర్‌లో నిర్వహించిన నాగమ్మ తల్లి సంబరాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక, భక్తి భావనలు నగరానికి శ్రీరామరక్షగా నిలుస్తున్నాయన్నారు. నగర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో తులతూగుతున్నారంటే దానికి ప్రధాన కారణం వారిలోని భక్తి భావమేనన్నారు. అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో అందరూ కలిసి సోదర భావంతో ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన నానికి ఉత్సవ కమిటీల ప్రతినిధులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నగరంలోని 1వ డివిజన్ సాయి నగర్ కాలనీలో స్వయంభువుగా వెలసిన నాగమ్మ తల్లి 13వ వార్షిక సంబరాలను వైభవంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే దేవతగా నాగమ్మ తల్లిని స్థానిక ప్రజలు నిత్యం పూజలు చేస్తూ ప్రార్థిస్తుంటారు. నాగమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, నగరపాలక సంస్థ కో– ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్ గుడిదేసి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక సత్తిబాబు, తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

వైభవంగా గంగానమ్మ సంబరాలు


కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న చిన్నారులు, యువతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 42వ డివిజన్లో వేంచేసి ఉన్న గంగానమ్మ, పోతురాజు బాబు స్నాన సంబరాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 108 మంది సువాసినీలు, 101 మంది అక్క, చెల్లెళ్లతో సుమారు 250 కలశాలతో నగర వీధుల్లో భారీ ఊరేగింపు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఘటాల ఊరేగింపు నిర్వహించగా భక్తులు దారి పొడవునా అమ్మవారికి పోతురాజు బాబుకు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నగర వీధుల్లో భజనలతో వైభవంగా ఊరేగించారు. ఊరేగింపులో సినీ, కోయ డ్యాన్స్, భూత, బేత వేషధారణలు, కోలాటం, శక్తి వేషాలతో కళాకారులు అలరించారు. ఈ సందర్భంగా 42వ డివిజన్లోని ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏటా రెండు, మూడు డివిజన్ల ప్రజలు కలిసి అమ్మవారి ఉత్సవాలు చేసుకునే వారమని, ఈ ఏడాది మొట్టమొదటగా తామే స్వయంగా ఉత్సవ నిర్వహణకు పూనుకున్నామన్నారు. తమకు సహాయ, సహకారాలు అందించిన పుర ప్రముఖులకు, ప్రజాప్రతినిధులకు, డివిజన్ పెద్దలకు, పోలీస్ అధికారులకు, భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఈరోజు వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి కుంభం పోసి, చద్ది నైవేద్యంతో పాటు. బూరెలు, గారెలు, పులిహోర, క్షీరాన్నంతో నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారని తెలిపారు. ఇదేవిధంగా ఏటా ఉత్సవాలు నిర్వహించి గ్రామదేవతలను శాంతింపజేస్తే ప్రతి గ్రామం అమ్మవారు, పోతురాజు బాబు కరుణాకటాక్షాలతో అందరూ కూడా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో చల్లగా జీవిస్తారని వారన్నారు.

కొత్త ఓట్ల కోసం 723 మంది దరఖాస్తు


చొదిమెళ్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బి సోమశేఖర్

ఏలూరు రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గంలో రెండురోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 1,590 దరకాస్తులు అందాయని ఏలూరు తహసీల్దార్ బి సోమశేఖర్ చెప్పారు. ఆదివారం చొదిమెళ్ల 7,8 పోలింగ్ కేంద్రంలోని బీఎల్వోల పనితీరు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఫారం –6 ద్వారా 723 మంది కొత్త ఓట్లకు దరకాస్తు చేసుకున్నారని చెప్పారు. 819 మంది ఓటర్లు అడ్రస్, పోలింగ్ కేంద్రం తదితర మార్పుల కోసం ఫారం–8 దరకాస్తు పూర్తి చేసి బీఎల్వోలకు అందించారన్నారు. మరో 48 మంది మరణించిన, స్థానిక నివాసం లేని వారి ఓట్లు తొలగించాలంటూ మరో 48 దరకాస్తులు అందాయన్నారు. మొత్తం నియోజకవర్గంలోని 212 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ప్రజల నుంచి దరకాస్తు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సరైన ఆధారాలు ఉన్న దరకాస్తులనే బీఎల్వోలు స్వీకరించారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బీఎల్వోలు కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. పవర్‌పేట, పీడీబీడీ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలతో పాటు ఓటర్లను వివరణ కోరామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎవరూ లేరన్న ప్రచారంలో వాస్తవం లేదని తేలిందన్నారు.

ఘనంగా ఇన్నర్ వీల్ క్లబ్ శత వార్షికోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతిష్టాత్మకమైన సేవా సంస్థ ఇన్నర్‌వీల్ క్లబ్ శతవార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ మార్గరెట్ ఆలివ్ గోల్డింగ్ అనే నర్స్ స్థాపించిన ఇన్నర్ వీల్ క్లబ్‌ను స్నేహం ,సేవ ధ్యేయంగా మహిళలు నిర్వహిస్తూ అంతర్జాతీయ సేవా సంస్థగా విరాజిల్లుతోందన్నారు. క్లబ్ 100వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వంద మంది మహిళలకు విశిష్ట మహిళ పురస్కార ప్రదానోత్సవం చేసి, ఘనంగా సత్కరించారు. పురస్కారం అందుకున్న వారిలో ఏలూరు నగర మేయర్ నూర్జహాన్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటు డాక్టర్లు, లాయర్లు, లెక్చరర్లు, టీచర్లు, వివిధ సంస్థల అధ్యక్షులైన మహిళలు, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు. అంతకు ముందు క్లబ్ చైర్మన్ అఫీషియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాండింగ్ ఇన్నర్ వీల్‌లో భాగంగా స్థానిక శాతవాహన నగర్‌లో ఇన్నర్ వీల్ పోల్ ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థినులకు సైకిళ్లు, స్మార్ట వేద పాఠశాలలో విద్యార్థుల కోసం ఫ్యాన్లు, పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

గుబ్బల మంగమ్మ గుడికి తగ్గిన భక్తుల రద్దీ

బుట్టాయగూడెం: వాతావరణశాఖ వర్షాలు కురుస్తాయని ఇచ్చిన సమాచారంతో ఆదివారం గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తుల తాకిడి తగ్గింది. అక్కడక్కడా మబ్బులతో పాటు చిరుజల్లులు కూడా కురవడంతో వాహనదారుల సంఖ్య కూడా తగ్గింది. గత మూడు వారాలుగా భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వర్షాలకు అక్కడక్కడ దెబ్బతిన్న రోడ్లను ఆలయ కమిటీవారు మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణంలో మార్పు చోటు చేసుకోవడంతో భక్తుల సంఖ్య తగ్గినట్లు ఆలయ కమిటీవారు చెప్పారు.

అవధూత స్వామి ధునిలో ప్రత్యేక పూజలు


ధునిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అవధూత శ్రీ గొలగమూడి వెంకయ్య స్వామి ఆలయంలో ధుని పూజ ఘనంగా నిర్వహించారు. అర్చకులు గండ్రపు సాయి ధునిలో హోమ ద్రవ్యాలు సమర్పించగా భక్తులు ప్రదక్షణలు చేశారు. అనివార్య కారణాలవల్ల కొద్ది నెలలుగా నిలిచిపోయిన అన్నసమారాధన కార్యక్రమం ఇకపై ప్రతి శనివారం కొనసాగిస్తున్నట్లు ఆలయ సేవా నిర్వాహకులు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆలయం వద్ద కార్తీకదీపం అలంకరణ కార్యక్రమాలు నిత్యం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాలివి దాసయ్యపాలెం గ్రామానికి చెందిన గంట బలరామయ్య(33) జంగారెడ్డిగూడెంలో ఓ బట్టల దుకాణంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక మసీద్ సెంటర్‌లోని పెట్రోల్‌బంక్ ఎదురుగా ఉన్న కనకదుర్గ మెడికల్ షాప్ పైన నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఉదయం బలరామయ్య సోదరి మంగతాయారుకు మడకం రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి బలరామయ్య రూమ్ వద్ద వాంతులు చేసుకుని చనిపోయినట్లు తెలిపాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న మంగతాయారు బలరామయ్య మృతిచెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బలరామయ్య స్నానానికి వెళ్లిన సమయంలో గుండెపోటుతో గాని, ఇతర అనారోగ్య సమస్యలతో గాని మృతిచెంది ఉండవచ్చని అతని సోదరి ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. స్థానిక ఆర్‌ఆర్‌పేట బాలయోగి వంతెన వద్ద ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పలివెల చంటి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నట్లు తెలియజేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు అమానుషం

ఏలూరు (టూటౌన్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు అమానుషమని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరెడ్డి అన్నారు. అసోసియేషన్ ఏలూరు యూనిట్ సమావేశం స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సీనియర్ న్యాయవాది పీపీ శాస్త్రి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమంత రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను ప్రజలకు వివరించేందుకు ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను, ఇటీవల దేశంలో మణిపూర్‌లో మతోన్మాదుల దాడులను వివరించారు. సమావేశంలో న్యాయవాది పీపీ శాస్త్రి, విశ్రాంత న్యాయమూర్తి పి.లక్ష్మి, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఆర్.శ్రీనివాస డాంగే తదితరులు మాట్లాడారు. సభ అనంతరం ప్రోగ్రెసివ్ ఫోరం ఏలూరు యూనిట్ కమిటీ 12 మందితో ఎన్నికైంది.